క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తిరునాల


పూజలందుకుంటున్న రేణుకా ఎల్లమ్మ తల్లి

వెల్దుర్తి: పట్టణ గ్రామ దేవత రేణకా ఎల్లమ్మ తిరునాల ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకులు అమ్మవారికి ప్రత్యేకాలంకరణ గావించారు. ఆలయ ధర్మకర్తలైన బొమ్మన వంశీయులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాలలో ఆనవాయితీ ప్రకారం గౌడ్ కులస్తుల కల్లు నైవేద్యం, ఆహుతితో అమ్మవారికి శాంతి జరిపారు. ఈనెల 5వ తేదీన శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారికి బోనాల సమర్పణ, ప్రత్యేక దర్శనం ఉంటాయి. సాయంత్రం అమ్మవారు, వారి కుమారుల ఉత్సవమూర్తులకు గుడి చుట్టూ రథోత్సవం జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం వారు ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచి రోజుకు రూ.272 వేతనం వచ్చేలా పని కల్పించాలన్నారు. పనులను నిర్దేశిత సమయంలోగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున్న ఉదయం తొందరగా వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. మళ్లింపు కాల్వలు, చెక్‌డ్యాం పూడికతీత తదితర పనులు చేపట్టాలని, పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు కనీస వసతులు కల్పించాలన్నారు. గ్రామాల్లో పండ్ల తోటలు సాగు చేయాలనుకునే రైతుల వివరాలను సేకరించాలని సూచించారు. అన్ని గ్రామాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

రూ.1.76 కోట్ల ఉపాధి నిధులు జమ

తుగ్గలి: ఉపాధి హామీ పనులకు సంబంధించి మెటీరియల్ బిల్లులు రూ.1.76 కోట్లు ఖతాలకు జమ అయినట్లు ఏపీఓ రామకృష్ణ గురువారం తెలిపారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌సెంటర్లు, కాంపౌండ్‌వాల్, ఇతర ఉపాధిలో మెటీరియల్ బిల్లులకు సబంధించి పనులు చేపట్టిన వారి ఖాతాల్లో నిధులు జమ అయ్యాయన్నారు. మొత్తం రూ.3.20 కోట్ల బిల్లులు రావాల్సి ఉండగా రూ.1.76 కోట్లు ఖాతాలకు జమ అయ్యాయని, విడతల వారీగా బిల్లులు విడుదల అవుతాయన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట, కలుగొట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు చేసినట్లు ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ శుక్రవారం నుంచి కలుగొట్ల, పుల్లగుమ్మి, సర్పరాజాపురం, బోయనపల్లె ఫీడర్ల కింద రైతులకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఉయ్యాలవాడ, రామళ్లకోట, సిద్దినగట్టు ఫీడర్ క్రింది రైతులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో గురువారం ఆదోనికి చెందిన మధు హాస్పిటల్, ఎస్ఎస్‌వీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ కురువ చాముండేశ్వరి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య నిపుణులు డాక్టర్ మానస, నిలోఫర్, శివరాం తదితరులు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానికులతో పాటు దర్గాలకు దర్శనానికి వచ్చిన భక్తులు, చుట్టు పక్కల గ్రామాలైన చిన్నహ్యాట, బీజీ హళ్లి, పెద్దహ్యాట, నెరణికి తదితర గ్రామాల నుంచి రోగులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్

హొళగుంద: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన గురువారం సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సెక్రటరీ మాట్లాడుతూ.. 5వ వార్డులోని కొన్ని వీధులకు కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో లీకేజీ అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బరిలో దిగితే పతకమే

- సెపక్ తక్రాలో రాణిస్తున్న ఆలూరు యువకుడు
- రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిథ్యం


రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందుకుంటున్న దృశ్యం (ఫైల్)

ఆలూరు: ప్లే గ్రౌండ్‌లోకి దిగితే ఓటమి ఎరగడు. ఆరుసార్లు జాతీయ స్థాయిలోనూ, 12 సార్లు రాష్ట్ర స్థాయి, సెంట్రల్‌జోన్‌లో ఒకసారి, డివిజన్ స్థాయిలో 30 సార్లు సెపక్‌తక్రా క్రీడల్లో లెక్కలేనన్ని బంగారు, సిల్వర్ పతకాలు, ప్రశంసా పత్రాలు 150 వరకు షీల్డులు, పథకాలను సాధించి రికార్డు సృష్టించాడు. ఏపీకి సెపక్ తక్రాలో కెప్టెన్‌గా వ్యవహరిస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నాడు ఆలూరుకు చెందిన యువకుడు

కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన కురువ బసవరాజు, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మధు ఒకటో తరగతి నుంచే సెపక్ తక్రా క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదువుకుంటుండగా పీఈటీ హనుమంత రెడ్డి అతనిలో సెపక్‌తక్రా బీజం వేశారు. నాటి నుంచి నేటి వరకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం స్థాయిలో ఎక్కడ సెపక్ తక్రా పోటీలు నిర్వహించిచా మధు పాల్గొని ప్రతిభ చాటుతూ పతకాలు కొల్లగొడుతున్నారు. 2014లో ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో సత్తా చాటారు. అదే సంవత్సరం కర్నూలులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు. 2015లో నెల్లూరులో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చాటారు. ఈలాగే 2016– 17లో నెల్లూరులో నిర్వహించిన క్రీడలలో ప్రతిభ చాటారు. 2016లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనుబరిచి ప్రశంసా పత్రంతో పాటు షీల్డును అందుకున్నారు. 2016లో కర్ణాటకలోని దావణగేరిలో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో సిల్వర్ మెడల్ పొందారు. 2017లో అంతర్ జిల్లాల పోటీలు కర్నూలులో నిర్వహించగా ప్రతిభ చాటుకున్నారు. 2017 ఫిబ్రవరి 21న హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో బంగారు పతకం సాధించారు. అలాగే 2018 సెప్టెంబర్ 22న చిత్తూరు జిల్లాలో జరిగిన క్రీడల్లో సత్తా చాటారు. అస్సాంలోని గౌహతిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటారు. 2018లో కర్నూలులో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి సీఎం కప్‌ను గెలుచుకోవడం కూడా మధుకే సాధ్యమైంది.


సాధించిన పథకాలతో క్రీడాకారుడు మధు

కోచ్ పవన్, రాష్ట్ర కార్యదర్శి రంజిత్, అశోక్ ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి ఎదిగానని మధు తెలిపారు. కురువ మధు ప్రస్తుతం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో మూడవ సంవత్సరం బీఎస్సీ చదువుతున్నాడు. ఈ సందర్భంగా సాక్షి మధును పలకరించగా అనేక అంశాలపై మాట్లాడారు. సెపక్ తక్రాలో రాణించాలంటే కొన్ని మెలకువలు తెలుసుకోవాలన్నారు. కాళ్లతో ఆడే క్రీడ కాబట్టి జాగ్రత్తగా ఆడితే తప్పా రాణించలేమని చెప్పారు. ఎప్పటికైనా అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు. తగిన ప్రోత్సాహం అందిస్తే మరింతగా రాణించేందుకు సిద్ధంగా ఉన్నానని మధు తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు

నందవరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం' ఫ్యామిలీ డాక్టర్' విధానం ప్రవేశపెట్టిందని పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్యలత పేర్కొన్నారు. గురువారం నదికైరవాడి గ్రామంలో 104 డాక్టర్ వీరేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు వేస్తామని వివరించారు. గర్భిణులు నెల సూదులు తప్పని సరిగా వేయించుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హెల్త్ సిబ్బంది రాములమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి భీరప్ప దేవర

నందవరం: మండలంలో కురబల కులదైవం భీరలింగేశ్వరుడి దేవర శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఆలయ కట్ట పరిధిలోని 72 గ్రామాల పూజారులు బండారి, పల్లకీ సేవల్లో పాల్గొననున్నారు. పవిత్ర తుంగభద్ర నది జలాలతో స్వామికి అభిషేకాలు గావించి దేవర ఉత్సవాలు ప్రారంభిస్తారు. స్వామికి పల్లకి సేవలు, జలాభిషేకాలు, హోమాలు, బండారి వంటి ప్రత్యేక పూజలు గావించనున్నారు. దేవర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో అలంకరించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టనున్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మిగనూరు డీఎస్పీ


జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ బి.సీతారామయ్య

ఎమ్మిగనూరురూరల్: జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను ఎమ్మిగనూరు డీఎస్పీ బి.సీతారామయ్య గురువారం కర్నూలులోని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ల విభజనలో భాగంగా మొదటిసారిగా ఎమ్మిగనూరుకు డీఎస్పీ పోస్టు వచ్చింది. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిసినట్లు సీతారామయ్య తెలిపారు.

సిమెంట్ బస్తాలు కావాలంటూ మోసం

వెల్దుర్తి: ఫలానా కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నాం. లారీ సిమెంట్ బస్తాలు కావాలి. లోడ్ ఫలానా ప్రదేశంలో దింపండి. పేమెంట్ ఆన్‌లైన్‌లో పంపుతున్నామంటూ డీలర్లకు ఫోన్ చేసి, తీరా లోడ్ వచ్చాక పేమెంట్ ప్రాసెస్‌లో ఉంది అంటూ వేరే వాహనాలలో సిమెంట్ బస్తాలను తీసుకెళ్లి మోసం చేస్తున్న సంఘటన స్థానికంగా హల్‌చల్ చేస్తోంది. వెల్దుర్తిలో పది రోజుల క్రితం 9866632379 నంబరు నుంచి ఎస్.సర్వేశ్ పేరుతో సిమెంట్ డీలర్ తిమ్మన్నకు కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి గణపతి కన్‌స్ట్రక్షన్స్ నుంచి మాట్లాడుతున్నానంటూ రూ.1,74,200 మొత్తానికి 520 బస్తాల సిమెంట్ ఆర్డరిచ్చాడు. గోనెగండ్ల సమీపంలో రోడ్డు పనులు జరుగుతున్న చోటికి లోడు పంపాలని కోరాడు. ముందుగా బ్యాంకు ట్రాన్స్‌ఫర్ ద్వారా తిమ్మన్న అకౌంట్‌కు ఒక్క రూపాయి పంపాడు. మిగతా పేమెంట్ ప్రాసెస్‌లో ఉందని నమ్మబలికాడు. సిమెంట్ లోడుతో లారీ కోడుమూరు దాటినా పేమెంట్ జరగకపోవడంతో సదరు వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించగా గోనెగండ్ల వద్ద లోడ్ దింపాలని ఆలోపు పేమెంట్ చేస్తానని నమ్మబలికాడు. జాగ్రత్తపడి లోడ్‌ను వెనక్కు పిలిపించుకుని ఇతర డీలర్ల వద్ద విచారించగా.. ఇదే నంబర్ నుంచి నంద్యాల, ఆళ్లగడ్డ, చాగలమర్రి నుంచి సిమెంట్ బస్తాలు డెలివరీ తీసుకుని పేమెంట్ ప్రాసెస్‌లో ఉందంటూ ప్రముఖ బ్యాంకులకు చెందిన పేమెంట్ స్లిప్పులు డీలర్లకు పంపి మోసగించినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా అదే నంబర్ నుంచి సిమెంట్ లోడ్‌కావాలని డీలర్లకు ఫోన్‌లు వస్తుండడం విశేషం.

గోనెగండ్లలో భారీ వర్షం


గంజిహళ్లి వద్ద పొంగి పొర్లుతున్న మల్లెలవాగు

గోనెగండ్ల: మండల వ్యాప్తంగా గురువారం ఉదయం కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గత మూడు రోజులుగా రాత్రి, ఉదయం వేళల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తునే ఉంది. హంద్రీనది పరివాహక ప్రాంతాలు ఆలూరు, ఆస్పరి, ఆదోని తదితర ప్రాంతాల్లో వర్షాలు కురువడంతో అగ్రహారం, గంజిహళ్లి మల్లెల వంకకు ఉదయం 11 గంటల వరకు వరద నీరు వచ్చింది. వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో గంజిహళ్లి, బైలుప్పల వెళ్లే దారి, అలాగే అగ్రహారం నుంచి ఎమ్మిగనూరు వెళ్లే దారిలో రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రవాహం తగ్గిన తరువాత రాకపోకలు కొనసాగాయి.

గురుశిష్యుల ఆరాధనోత్సవాలకు వేళాయె

వెల్దుర్తి: మండల పరిధిలోని బోయనపల్లె గ్రామ పరిధిలో కొలువైన గురుశిష్యులు రాధాస్వామి, ఆదవేని (ఆదోని) లక్ష్మమ్మ అవ్వల ఆరాధనోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. బోయనపల్లె, రామళ్లకోటతోపాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలివచ్చి ఆరాధనోత్సవాల్లో పాల్గొననున్నారని, భక్తులకు అల్పాహార, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం నందికోల సేవ ఏర్పాట్లు చేశామన్నారు.

నేడు భజన పోటీలు

ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గుడి ఆవరణలో రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.10,016, రూ.8,016, రూ.6,016, రూ.5,016, రూ.4,016, రూ.3,016,రూ.2,016, రూ.1,516, రూ.1,016 బహుమతులుగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొనదలచిన వారు 99637 35051, 80746 26716 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం కోతపై విచారణ


బియ్యం బస్తాల తూకాన్ని పరిశీలిస్తున్న తహస్తాల్దార్ ఉసేన్‌సాహెబ్

ఆలూరు: ఆలూరు సివిల్ సప్లయి స్టాక్ పాయింట్ నుంచి హొళగుంద మండలానికి పంపిణీ చేసిన బస్తాలలో బియ్యం తక్కువగా ఉండడంపై గురువారం హొళగుంద తహశీల్దార్ ఉసేన్‌సాహెబ్ విచారణ చేపట్టారు. హొళగుంద 4, 19, 32 రేషన్ షాపుల డీలరుక్లు రెండు రోజుల క్రితం పంపిణీ చేసిన బస్తాల్లో రేషన్ బియ్యం 50 కేజీలకు తక్కువగా ఉండడంతో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ షఫిఉల్లా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం బియ్యం బస్తాలను ఆర్ఐ దినోజ్‌కుమార్, తదితరులు తూకం వేసి పరిశీలించారు. ఎంఎల్‌సీ స్టాక్ పాయింట్‌లో బస్తాలను తూకం వేయకుండానే డీలర్లుకు పంపిణీ చేస్తున్నారా? అనే అంశంపై డీటీ, రూట్ అధికారి, మరి కొందరు సిబ్బందిని విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. అలాగే మండలానికి మంజూరు చేస్తున్న చక్కెర, ఇతర నిత్యావసర వస్తువుల తూకాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తిగత కక్షలు వీడాలి


కక్షిదారులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

ఆలూరు: గ్రామాల్లో వ్యక్తిగత కక్షలకు పోకుండా ప్రశాంత జీవనం గడపాలని, ఫ్యాక్షన్ తగదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో రికార్డులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల కక్షిదారులతో సమావేశమయ్యారు. ఇప్పటికైనా మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. పిల్లలను బాగా చదివించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఎస్ఐ భూపాలుడు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

10న రాతిదూలం లాగుడు పోటీలు

తుగ్గలి: వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన పగిడిరాయిలో వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వృషభ యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 99633 18902, 80197 51675 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

మద్దికెర: మద్దికెర గ్రామ శివార్లలో పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణంలో వెలసిన శ్రీవెంకప్ప స్వామి 91వ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉదయం స్వామి వారి సమాధిని అలంకరించి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సంతాన దేవుడిగా ప్రసిద్ధి:

సంతానం కలగని వారు ఎంతో మంది వెంకప్ప స్వామి వారిని నాలుగు సోమవారాలు మొక్కుకుంటే కోరిక నెరవేరుతుందని భక్తుల విశ్వాసం. అంతేగాక ఈ ప్రాంతంలో చాలా మంది వెంకమ్మ, వెంకప్ప అనే పేర్లు పెట్టుకుంటారు. అలాగే రైతులు ఆప్యాయంగా చూసుకునే పాడిపశువులకు రోగాలు వస్తే స్వామి వారి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేస్తే రోగాలు నయం అవుతాయని విశ్వాసం.

9న మండల సర్వసభ్య సమావేశం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో మండలంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలతో రావాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ తప్పక హాజరుకావాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో కడుపునొప్పి తాళలేక గొల్ల పార్వతి (23) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన మేకల నాగరాజు, భార్య గొల్ల పార్వతి, వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంత కాలంగా పార్వతి కడుపునొప్పితో బాధపడుతోంది. హాస్పిటల్‌లో చూయించినా తగ్గకపోవడంతో ఎవరూ లేని సమయంతో ఇంటి పైకప్పునకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చి భర్త, కుటుంబ సభ్యులు వేలాడుతున్న పార్వతిని కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

10 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని తాపలకొత్తూరు గ్రామంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో కాశీ విశాలక్ష్మి, విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుపనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠతోపాటు ధ్వజ స్తంభం, నంది, కలశ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు వెల్లడించారు. 10న గణపతిపూజ, జలాధివాసం, దీక్షహోమాలు, 11న ప్రాతఃకాలపూజ, గ్రామోత్సవం, రాత్రి చెక్కభజన బృందంతో జానపద కచేరి ఉంటుందని తెలిపారు. 12న ఉదయం 6:01 నుంచి 7:01 గంటల్లోపు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం శివపార్వతుల కల్యాణం, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

నేడు పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ

చిప్పగిరి: మండలంలోని కుందన గుర్తి గ్రామంలో శుక్రవారం పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారు మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం పలువురు పీఠాధిపతులు, పురోహితుల ఆధ్వర్యంలో అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉపాధి కూలీల పొట్ట కొట్టేందుకు కుట్ర

తుగ్గలి: ఉపాధి కూలీల పొట్టకొట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు శ్రీరాములు ఆరోపించారు. గురువారం తుగ్గలిలో ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వలసల నివారణ కోసం వామపక్షాల సూచనల మేరకు గత యూపీఏ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. బడ్జెట్‌లో 25 శాతం కోత విధించడంతో పాటు, రెండు పూటలా పనులు, హాజరు నిబంధనలతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి పథకంపై మోదీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను అడ్డుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్తం

రేషన్ బియ్యం స్వాధీనం

గోనెగండ్ల: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. వివరాలు.. గోనెగండ్లకు చెందిన ఎరుకల రంగన్న, నాగన్న రేషన్ బియ్యాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకున్నారు. వాటిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి 35 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరుసు ప్రశాంతంగా జరుపుకోండి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న సద్గురు అల్లీపీరసాహెబ్ స్వాముల ఉరుసు ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. ఆయన గురువారం గుడేకల్‌లోని దర్గాను సందర్శించి పీఠాధిపతి, దర్గా ట్రస్ట్ ప్రెసిడెంట్ గురు గాజీహుసేన్ పీరాసాహెబ్ స్వాములను కలసి వేడుకల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రూరల్ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

మద్దికెర: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ రవీంద్రనాథ్ సూచించారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. 16 రకాల పండ్ల తోటల సాగుకు అవకాశంఉందని ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్థానిక ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కల్తీ కల్లును అరికట్టాలి

వెల్దుర్తి: మండలంలోని దుకాణాల్లో కల్తీ కల్లు రాజ్యమేలుతోందని వెంటనే అరికట్టాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ, అనుబంధ సంఘాల ప్రతినిధులతో కలిసి గురువారం మాట్లాడుతూ.. కల్తీ కారణంగా పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే విచారణ చేపట్టి కల్తీ కల్లు విక్రయించే దుకాణాలను సీజ్ చేయాలని కోరారు.

తక్షణ సాయం అందజేత

వెల్దుర్తి: స్థానిక మేజర్ పంచాయతీలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి బీసన్న అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి అతని కుటుంబానికి అందాల్సిన రూ.25 వేల తక్షణ ఖర్చుల నగదును గురువారం ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు మృతుని భార్య జయశీలమ్మకు అందించారు. పూర్తి సాయం ప్రభుత్వం నుంచి త్వరలో అందుతుందని అధికారులు తెలిపారు.

12న మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్, ఇతర శాఖాధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

పెన్షనర్లు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఆలూరు రూరల్: పెన్షనర్లు ఈ నెల 10వ తేదీలోపు స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఈ-కేవైసీ చేయించుకోవాలని ట్రెజరర్ శ్రీనివాసులు సూచించారు. సీఎంఎఫ్ఎస్ ఐడీలను ఆధార్ లింకు చేసి మొబైల్‌కు అనుసంధానం చేసుకోవాలని చెప్పారు.ఆలూరు సబ్ ట్రెజరీ పరిధిలో మొత్తం 685 మంది పెన్షనర్లు ఉండగా ఇప్పటివరకు 430 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారని, మిగతా 255 మంది గడువులోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. స్థానిక సబ్ ట్రెజరీలో సేవలు అందుబాటులో ఉంటాయని పింఛన్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామ సమీపంలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీకాంత్‌ఆచారి స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు.

ఘనంగా నృసింహ జయంతి

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో గురువారం లక్ష్మి నరసింహ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని కంబరాయ కట్ట వద్ద ఉన్న విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ప్రదక్షిణ, అభిషేకాలు, పవన హోమం, మహామంగళ హారతి, అలంకారం, ఆకుల అర్చన, రుద్రాభిషేకం తదితర పూజలు చేపట్టారు. ప్రవచన కర్తలు ఎర్రిస్వామి ప్రవచనం ఇస్తూ స్వామి వారి మహత్యం, లీలలను భక్తులకు వివరించారు. భజన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.

ఎల్లార్తి మీదుగా బస్సులు నడపండి

హొళగుంద: కర్నూలు నుంచి హొళగుందకు వయా ఎల్లార్తి, ఆలూరు, పత్తికొండ మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు సింధువాళ హనుమప్ప, ఎల్లార్తి సర్పంచ్ ఏసునుల్లా, ఎంపీటీసీ శివన్న, గ్రామపెద్దలు గోపాల్‌రెడ్డి, రంగన్న, చక్రపాణి తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హొళగుందకు వచ్చిన కర్నూలు ఆర్టీసీ ఆర్ఎం వెంకటరామం, ఆదోని డీఎం మహమ్మద్ రఫీకి వినతి పత్రం ఇచ్చారు. ఆర్ఎం స్పందిస్తూ వైఎస్సార్ కడపలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాత్రి అక్కడే నిద్రించి దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డిసాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాద, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

ఆర్బీకే సేవలు విస్తృతం చేయండి


ఆర్బీకే సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ సునీత

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేల సేవలు ప్రతి రైతుకు అందేలా సిబ్బంది పనిచేయాలని ఆలూరు ఏడీఏ సునీత ఆదేశించారు. ఆమె గురువారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 76 ఆర్బీకేల సిబ్బందికి ఖరీఫ్, రబీ సీజన్ల యాక్షన్ ప్లాన్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .రైతులు సాయిల్ టెస్ట్ చేయించుకునేలా ప్రోత్సహించాలని, నకిలీ విత్తనాలపై అప్రమత్తం చేయాలన్నారు. విత్తనాలపై అనుమానం ఉంటే అగ్రి ల్యాబ్‌కు పంపించి టెస్ట్ చేయించాలన్నారు. నేలలో తేమ శాతం ఉన్నప్పుడే విత్తనం వేసేలా చూడాలని, రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందుల ఆర్డర్ చేయించాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నమోదు ప్రక్రియ సాంకేతిక పరిజ్ఞానంతో చేయాల్సి ఉంటుందని, జియో ట్యాగింగ్ ద్వారా క్రాప్ బుకింగ్ నమోదు జరుగుతుందన్నారు. కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతు గ్రూపులకు సబ్సిడీ యంత్రాలు అందించాలన్నారు. ఏఓలు వెంకటేష్ గౌడ్, నరేంద్ర కుమార్, శివ శంకర్ అగ్రిల్యాబ్ టెక్నికల్ ఏఓ రాజేష్ ఆర్బీకే సిబ్బంది హాజరయ్యారు.

నీటి ట్యాంకు ఏర్పాటు


నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న సర్పంచ్ సోమేశ్వరమ్మ

ఆలూరు రూరల్: మండలంలోని తుంబళబీడు గ్రామంలో రూ.3 లక్షలతో శ్మశాన వాటికలో నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. గురువారం ఆ గ్రామ సర్పంచ్ సోమేశ్వరమ్మ ట్యాంకును ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామస్తుల వినతి మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో గడగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు వెచ్చించి నీటి ట్యాంకు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో ఉన్న బోరు నుంచి 800 మీటర్ల పైపులైన్ వేసి నీటి ట్యాంకుకు నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, జయరాం గ్రామస్తులు ఉన్నారు.